


ఒకానొక రోజున —

అంటే—

అప్పటికి సత్యంగారు ఉద్యోగంలో చేరి పాతిక సంవత్సరాలు తిరిగిపోయాయి. సత్యంగారికి పిల్లలు పుట్టారు. వాళ్ళు పెరిగి పెద్దవాళ్ళయారు. అతని ఉద్యోగం పెరిగింది. సంపాదన పెరిగింది. 'సంప్రదాయం' అని అరిచే అతని తల్లిదండ్రులు కాలం చేశారు. తలమీది వెంట్రుకలు ఒక చెంప నెరిసిపోయాయి. అతని భార్య దేవికి కళ్ళద్దాలు వచ్చాయి. కొత్త ఇల్లు వచ్చింది. కొడుకు మెడిసిన్ పూర్తి చేశాడు. కూతురు వంటా వార్పుతో బాటు పెద్ద పెద్ద నవలలు రాసిపారేస్తూంది. ఇలా చాలా చాలా మార్పులు వచ్చాయి. అసలీ కథ 'ఒకానొక రోజున' అంటూ మొదలు పెట్టడానికి కారణం— మనసనే జైలు గోడల మధ్య మూసలిదయి పోయిన సత్యంగారి ఆశయం ఆ రోజునే మళ్ళీ బయటికి వెలుగులోకి వచ్చింది.

ఆ రోజు సాయంకాలం వీధి గుమ్మంలో వాలు కుర్చీలో కూర్చుని యథాలాపంగా వార్తా పత్రిక తిరగేస్తున్న సత్యం గారు — వాకిట్లో ఆటోరిక్షా ఆగిన చప్పుడు విని, తల ఎత్తి చూశారు.

సత్యంగారి చెల్లెలు అన్నపూర్ణ, ఆమె భర్త వీరభద్రరావు, అతని రెండు చేతుల్లో పదేళ్ళపాప, పది కేజీల సంచీ కనిపించాయి. అంతకుముందు వాళ్ళిద్దరూ చాలాసార్లు వచ్చారు. ఈ మధ్య

**శ్రీరాజ్**

కాలంలో వాళ్ళ రాకపోకలు పూర్తిగా తగ్గిపోయాయి. అందుకు కారణం— వయస్సూ, బాధ్యతలు పెరగడమే.

"రా, అమ్మా, అమ్మలూ! ఇంటి దగ్గర పిల్లలంతా కులాసాయేనా? ఏమయ్యా భద్రం! మీ అమ్మగారు బావున్నారా? హల్లో, ప్రియా, నన్ను పెళ్ళి చేసుకోవడానికి వచ్చేవా?" సత్యంగారు పేరు పేరునా అందర్నీ ఆప్యాయంగా పలకరించేరు.

ప్రియా సిగ్గుపడిపోతూ ఇంట్లోకి పరుగు తీసింది.

"అన్నయ్యా! ఇంత అర్థాంతరంగా ఎందుకు వచ్చామో తెలుసా? పెళ్ళి విషయాలు మాట్లాడడానికే." అన్నపూర్ణ అన్నయ్యను చూసిన ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతూ అంది.

"శుభం. నేను కాదంటానా? ప్రియాను పెళ్ళి చేసుకోవడానికి నా కెలాంటి అభ్యంతరమూ లేదు. ఎటొచ్చీ మీ వదినకి ఉందేమో అడిగి తెలుసుకో."

"పాపం! మీ అన్నకి మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని ఉంది కాబోలు!" వీరభద్రరావు వెక్కిరింపుగా అనేసరికి — అంతా గొల్లున నవ్వేరు, అప్పుడే అక్కడికి వచ్చిన విశాలాక్షితో సహా.

చాలా రోజుల తరవాత ఇల్లంతా సందడిగా ఉంది.

రాత్రి భోజనాలు అయ్యేక అంతా హాల్లో కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

"అన్నయ్యా! రాజేష్‌కి మా విద్యని ఇవ్వాలనుకుంటున్నాం. నువ్వేమంటావు?" తన రాకకు అసలు కారణాన్ని విడమరుస్తూ అంది అన్నపూర్ణ.

'అమ్మో! అత్తయ్య గడుసుదే. మామూలుగా సాగిపోయే కథలో మంచి మలుపుని సృష్టించి పాఠకుల్ని ఉత్తేజపరుస్తుంది' అనుకుంది, ఆ ఇంటి రచయిత్రి శైలజ.

విద్యకు కాబోయే మొగుడు రాజేష్—ఆ మాటవిని సిగ్గుపడిపోతూ, మెలికలు తిరిగిపోయాడు.

దేవి కళ్ళద్దాలు మీాదికి జరుపుకుంటూ భర్త ముఖంలోకి సమాధానంకోసం చూసింది.

వీరభద్రరావు మామూలుగానే ఉన్నాడు.

అన్నపూర్ణ మాటకు సత్యంగారు ఒక్కక్షణం ఏదో అయిపోయారు. తనెప్పుడూ — రాజేష్ పెళ్ళీడుకు వచ్చాడనికాని, అన్నపూర్ణ తనతో వియ్యమందటానికి వస్తుందని కాని వూహించలేదు. విద్యతో రాజేష్‌కి పెళ్ళి జరిపించటం అతనికి సుతరామూ ఇష్టంలేదు. అయితే — ఆ విషయం ఎవరితోనూ చెప్పలేదు.

"అమ్మలూ! ఇప్పుడు తొందరేమొచ్చింది? ఆ తరవాత మాట్లాడుకుందాం" అంటూ మెల్లగా అక్కడినుండి లేచిపోయారు సత్యంగారు.

అతని ముఖంలో రంగులు మారిన విషయం ఒక్క దేవికితప్ప మరెవరికి తెలియలేదు. ఆ తరవాత వదినా, మరదళ్ళు వూసుల్లో పడటంచేత భర్తతో మాట్లాడే అవకాశం దేవికి దొరకలేదు.

ఆ రాత్రి సత్యంగారు నిద్రపోలేదు.

అతనికి చిన్నప్పటినుంచి ఒక ఆశయం ఉంది. అది అతని మనసులో పద్దెనిమిదేళ్ళ ప్రాయంలోనే అంకురించింది. నూనూగు మీసాలు వస్తున్నప్పుడు, కాలేజీలో అడుగు పెట్టినప్పుడు, అందమైన అమ్మాయిల్ని చూసినప్పుడు ప్రేమించి పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. అది అతని జీవితంలో మొదటి ఆశయం. ఏకైక జీవితాశయం కూడా.

అతనికి అందం ఉంది. ఆరోగ్యం ఉంది. ఒక అందమైన అమ్మాయిని ప్రేమించి, తన హృదయ సామ్రాజ్యానికి పట్టమహిషిని చేయాలని ఆశపడ్డాడు. అయితే—ప్రేమించే అర్హతను, హక్కును అతని తల్లిదండ్రులు ఇవ్వలేదు. ముప్పయిశాతం ఆచారం




## కావలెను

శ్రీరిక కాలవాలల్ శకి సూటింగ్స్, షర్టింగ్స్ మరియు చీరెల అమ్మకము పెంపొందించుట ద్వారా జీతం లేదా కమీషను మీద నెలకు రు. 700/— సంపాదించుకొనుటకు ఏజంట్లు కావలెను. ఉచిత లిటరేచరుకు, శాంపిల్సుకు వ్రాయండి.

**SHAKTI TEXTILES AGENCY (AP)**
**Post Box No. 1138, Delhi-110006**




※ మా బ్రాంచీలు ※

1. పట్టాభి మార్కెట్........ మచిలీపట్నం
2. శేషయ్య వీధి............ విజయవాడ-1
3. ట్రంకు రోడ్డు............ నెల్లూరు
4. G కార్ స్ట్రీట్............ తిరుపతి
5. గాంధీ రోడ్డు............ తిరుపతి
6. సుభాష్ రోడ్డు........ అనంతపురం
7. ఎవెన్యూ రోడ్డు....... బెంగుళూరు
8. గాంధి బజారు......... బెంగుళూరు
9. గాంధీ బజారు............ షిమోగా
10. మునిసిపల్ మార్కెట్ ........ కర్నూలు
11. జయంతి బిల్డింగ్స్........ బెంగుళూరు
12. మద్రాసు రోడ్డు............ కడప
13. రామన్‌కోయిల్ స్ట్రీట్..... చిత్తూరు
14. నాగులకుంటరోడ్డు... నంద్యాల
15. గాంధివిగ్రహంవద్ద - నర్సరావుపేట

కట్నంబాట్లనీ, ముప్పయి శాతం తరవాత ఆడపిల్లలున్నారని, ముప్పయిశాతం అత్త కూతుర్నే చేసుకోవాలని, పది శాతం అదీ ఇదీ అని అతని ఆశయాన్ని కొట్టిపారేశారు. అతను ఎదురు తిరగాలనుకున్నాడు కానీ, అతని తల్లిదండ్రులు ఒక తరానికి సరిపడే దూషణలు పెట్టి, అతనిలోని మనిషిని క్రుంగదీశారు. పెద్దలు పట్టుబట్టి, అతని చేత అత్త కూతు రవబడే పార్వతీదేవి మెడలో మూడు ముళ్ళూ వేయించారు.

అతని ఆశయానికి సంకెళ్ళువేసి, యావజ్జీవ కారాగార శిక్ష విధించారు.

ఈ రోజున మళ్ళీ పాత జ్ఞాపకాలు కదులుతున్నాయి.

తనలాగే రాజేష్ కూడా అత్తకూతుర్ని పెళ్ళి చేసుకోవడం సత్యంగారికి ఇష్టం లేదు. మామూలుగా అత్తకూతురుతో కాకుండా మరెవరితోనో కొడుకు పెళ్ళి జరిపించాలి. మెడిసిన్ చదివినప్పుడు రాజేష్ ఎవరినయినా ప్రేమించే ఉండవచ్చు. ఆ ప్రేమను అంగీకరించడానికి, ఆ అమ్మాయితో పెళ్ళికి 'తథాస్తు' అనటానికి తను సిద్ధమే. అతను సాధించలేని ఆశయం—రాజేష్ ప్రేమించి, పెళ్ళి చేసుకుంటే అంతకుమించిన ఆనందం మరొకటి ఉండదు.

మరునాడు అదే విషయాన్ని మళ్ళీ కదలేసింది అన్నపూర్ణ.

"అన్నయ్యా! వైశాఖం వస్తోంది. ఎదిగిన పిల్లను ఇంట్లో పెట్టుకోవడం బాగుండదుకదా? నువ్వు అవునంటావనే నమ్మకంతో మీ బావగారూ, నేనూ వచ్చాం. ఏ మంటావు?"

సత్యంగారు ఇరకాటంలో పడ్డారు. కాస్సేపు తటపటాయించినా, తప్పించుకోవడానికి ఏదో చెప్పాలని మాట్లాడేరు.

"అమ్మలూ! ఇప్పుడు రాజేష్ పెళ్ళికి ఏం తొందర? అయినా వాడికి ఇష్టం ఉండాలిగా?"

"మీ వరస బాగుంది. వాడు పెళ్ళి చేయండని మిమ్మల్ని తొందర చేయాలా?" దేవి కల్పించుకుంది.

"ఏం, రాజేష్! మా విద్యంటే నీ కిష్టమేనా? వీరభద్రరావు అందుకున్నాడు.

"అత్త కూతురంటే ఇష్టం ఉండకపోవడమేమిటండీ? మీరు కాదంటే—మా విద్యను రాక్షస వివాహం చేసుకు తీరుతాను." రాజేష్ ఒక జోక్ వేసి, గలగల నవ్వేస్తూ తన ఇష్టాన్ని ప్రకటించాడు.

సత్యంగారు దిగ్భ్రమ చెందారు.

'ఏమిటీ! రాజేష్ విద్యను చేసుకోవడానికి ఇష్టపడుతున్నాడా? విద్య అంటే ఎవరు? అత్త కూతురు. తనలాగే అత్తకూతుర్ని పెళ్ళి చేసుకుంటాడా? ఆరేళ్ళు విశాఖపట్నంలో మెడిసిన్ చదువుతున్న రాజేష్ ఒక్క అమ్మాయినీ ప్రేమించలేదంటే సిగ్గుగా ఉంది. పోనీ—విద్యనే ప్రేమించాడని అనుకోవడానికి వీల్లేదు. ఎప్పుడో ప్రియాలా పదేళ్ళ పిల్లగా ఉన్నప్పుడు విద్య ఇక్కడికి వస్తే రాజేష్ చూశాడు. ఆ తరవాత వాళ్ళిద్దరూ కలుసుకొనే సందర్భం రాలేదు. మరి, ఎందుకని రాజేష్ విద్యను పెళ్ళాడాలనుకుంటున్నాడు.'

కొడుకును చాటుగా పిలిచి, సత్యంగారు డైరెక్ట్‌గా కొంత, ఇన్‌డైరెక్ట్‌గా కొంత మాట్లాడేరు.

"ఒరేయ్, రాజేష్! నువ్వు మామూలుగా అత్త కూతుర్ని పెళ్ళి చేసుకోవడం నాకు ఏదోలా ఉంది."

"అంటే?" సందేహం వెలిబుచ్చాడు రాజేష్.

"ఇష్టం లేదు."

"డాడీ! నేను పెళ్ళంటూ చేసుకుంటే విద్యను మాత్రమే చేసుకుంటాను. అయినా, నేను వర్ణాంతర వివాహం చేసుకోవడంలేదే! ఎవరో అమ్మాయిని ప్రేమించి, మీకు ఇబ్బందిని కలిగించడం లేదే!"

"అదే నేనూ అంటున్నాను—నువ్వు వర్ణాంతర వివాహం చేసుకున్నా, ప్రేమించి పెళ్ళి చేసుకున్నా నాకు ఆనందమే. కానీ, ఇలా అత్తకూతురు అంటూ...."

"విద్య చేసిన నేరం ఏమిటి, డాడీ? ఈ ఇంటి కోడలుగా వచ్చే హక్కు ఎందుకు లేదంటారు?" ఫక్తు తెలుగు సినిమాలో హీరోలా తండ్రిని నిలదీశాడు. అంతా మెలోడ్రామాలాగా సాగుతూంది.

"నేను ఫలానా అని చెప్పలేను కానీ, నాకు ఇష్టం లేదు, రాజేష్!"

"సారీ, డాడీ! నేను విద్యను ఇష్టపడుతున్నాను."

సత్యంగారు ఎలా మాట్లాడినా ప్రయోజనం లేకపోయింది. అత్తకూతుర్నే పెళ్ళి చేసుకుంటానని రాజేష్ పట్టుబట్టాడు.

సత్యంగారి ఆశయం ఏం కావాలి?

ఒకప్పుడు తను ప్రేమించి పెళ్ళి చేసుకుంటానంటే, తన తల్లి దండ్రులు నిర్దాక్షిణ్యంగా తన ఆశయాన్ని తుడిచి వేశారు. ఇప్పుడు అత్తకూతుర్ని తప్ప మరెవర్నీ పెళ్ళాడనని తన కొడుకు నిక్కచ్చిగా చెప్పి, తన ఆశయాన్ని నాశనం చేస్తున్నాడు. ఆరోజు కొడుకుగా తన తల్లి దండ్రుల్ని ఎదిరించలేకపోయాడు. ఈరోజు తండ్రిగా తన కొడుకును ఎందుకు దండించ లేడు?

సత్యంగారు రాజేష్ పెళ్ళికి ఒప్పుకో లేదు.

"అవు నన్నయ్యా! కొడుకును డాక్టరు చేశావుగా? కట్నం పేరుతో లక్షలు గుంజాలనుకుంటున్నావు. మేము పేద వాళ్ళం. నీ తాహతుకు అందం. అందుకే చాలా నిర్మొహమాటంగా కాదంటున్నావు." అన్నపూర్ణ కళ్ళు వత్తుకుంది.

"చూడండి, బావగారూ! అమ్మాయీ, అబ్బాయీ ఒకరినొకరు ఇష్టపడుతున్నారు. కాదనకండి. మీకు కావలసింది కట్నం. ఎం కావాలో అడగండి. నా ఇల్లూ వాకిలీ అమ్మి, మీ ముడుపు చెల్లిస్తాను." వీరభద్రరావు బాధపడి పోయాడు.

"మీరు పొరపడుతున్నారు. నాకు కట్నాలు, కానుకల మీద ఆశ లేదు. నన్ను నమ్మండి." సత్యంగారు కంగారు పడ్డారు.

"బాగుందండీ! మీ అభ్యంతరం ఏమిటట?" దేవికి భర్త వైఖరి అర్థం కావడం లేదు.

"ఇది ఫలానా అని చెప్పలేని అసహాయత. నన్నర్థం చేసుకోండి, ప్లీజ్!"

ఇంట్లో గందరగోళం మొదలయింది. మాటకు మాట పెరిగింది. పట్టింపులు చోటు చేసుకున్నాయి. ఆ ఇంట్లో ఒక్క క్షణంకూడా ఉండమంటూ

అన్నపూర్ణ, వీరభద్రరావు అప్పటి కప్పుడే ప్రయాణానికి సిద్ధపడ్డారు.

తను భర్తతో మాట్లాడి ఒప్పిస్తానని, మరునాటికి ప్రయాణం వాయిదా వేసుకోమని దేవి—ఆ ఇద్దర్నీ బతిమాలింది. వాళ్ళు సరే అన్నారు.

"ఇప్పుడు చెప్పండి—అడ్డు చెప్పవలసిన నేనే ఈ పెళ్ళికి ఇష్టపడుతున్నాను. విద్య మా చెల్లి కూతురు. పైగా మన రాజేష్ కోరి పెళ్ళి చేసుకుంటా నన్నాడు. మీ రెందుకు వద్దంటున్నారో చెప్పండి. చెప్పకపోతే నా మీద ఒట్టు." రాత్రి పడుకునే ముందు దేవి భర్తను నిలదీసింది.

ఒట్టు పెట్టిన తరవాత సత్యంగారికి చెప్పక తప్పలేదు.

"నేను పొందలేనిది నా కొడుకైనా ప్రేమించి, పెళ్ళి చేసుకుని సాధిస్తాడని ఆశించాను. కానీ, ఇలా నాలా అత్త కూతురు అంటూ సాధారణంగా పెళ్ళి చేసుకోవడం నా కిష్టం లేదు."

ఒక కొత్త నిజం దేవికి తెలిసింది. ఆమెలో ఉక్రోషమూ, అవమానమూ, మరి ఏవేవో చోటు చేసుకున్నాయి. అతనికి సమాధానం ఇవ్వలేదు. అసలామె ఏమీ మాట్లాడలేదు.

పార్వతీదేవి పట్టుబట్టి కొడుకు చేత అత్త కూతు రనబడే విద్య మెడలో మూడు ముళ్ళూ వేయించింది.

'మాంగల్యం తంతునా నేనా మమజీవన హేతునా'

* * *

సత్యంగారి ఆశయం మరోకసారి ఘోరంగా దెబ్బతినింది.

తను ప్రేమించి పెళ్ళి చేసుకోవా లనుకున్నాడు. అది జరగలేదు. తన కొడుకు ప్రేమించి పెళ్ళిచేసుకుంటే చూడాలనుకున్నాడు. అది జరగలేదు. నిన్న ఓటమి. నేడు ఓటమి. రేపు ఏమవుతుందో? పుట్టబోయే తన మనవడైనా తన ఆశయాన్ని ఆచరిస్తాడా? ప్రేమించే హృదయానికి పిరికితనం ఉండకూడదు. ఉంటే — తనలాగ ఎవరైనా సరే బాధపడక తప్పదు.

పెళ్ళి జరిగిపోయింది. శోభనం జరిగిపోయింది. కొత్త దంపతులు హనీమూన్‌కు వెళ్ళిపోయారు. వచ్చిన చుట్టాలు ఉండగలిగినన్నాళ్ళు ఉండి వెళ్ళిపోయారు.

సత్యంగారి ఆశయం — అతన్ని తల్లిదండ్రుల దగ్గర చెడ్డవాణ్ణి చేసింది. బంధువులచేత అవమానపరిచింది. అన్నపూర్ణ, వీరభద్రరావులతో గొడవ తెచ్చింది. ఎప్పుడూ ఎదుట పడి మాట్లాడి ఎరగని కొడుకు తనను ఎదిరించేటట్లు చేసింది. చివరికి అతనికీ, దేవికీ మధ్య నెలరోజులు అడ్డగోడ లేవదీసింది.

ఆ రోజు —

అడ్డంగా నిలిచిన గోడమీదికి వంగి, నెలరోజుల నిశ్శబ్దాన్ని బ్రేక్ చేస్తూ — "దేవీ! నాతో నువ్వెందుకు మాట్లాడ్డం లేదు?" అని సత్యంగారు అడిగారు.

కొన్ని క్షణాలు మౌనం.

అయినా సత్యంగారు ఆమె సమాధానంకోసం ఎదురుచూస్తూ అక్కడే ఉండిపోయాడు.

"ఇంతకాలమూ మనసులో పెళ్ళానికి చోటులేని మొగుడితో కాపురం చేసి, మోసపోయానని బాధపడుతున్నాను. ప్రేమించిన దాన్ని పెళ్ళిచేసుకోలేక, ఇష్టంలేని అత్తకూతురు మెడలో తాళికట్టినట్లు ఇప్పటివరకు నాకు తెలియదు." దేవి రెండు పుష్కరాల తర్వాత మొదటిసారి భర్త మీద ఎదురుతిరిగి మాట్లాడింది.

"దేవీ! నువ్వు పొరపడ్డావు. ప్రేమించి పెళ్ళి చేసుకోవాలనేది నా ఆశయం అన్నాను కాని, నేను నెవర్నో ప్రేమించానని చెప్పలేదు. అసలు నేను ఎవర్నీ ప్రేమించి, నా హృదయంలో ఆ ఎవరికో చోటు ఇవ్వలేదు." సత్యంగారు అడ్డుగోడకున్న కొన్ని ఇటుకలు తొలగించి, మాటిగా చెప్పారు.

దేవి నీళ్ళుచిమ్మిన కళ్ళతో భర్తవేపు చూసింది. అతని ముఖం చాలా నిర్మలంగా ఉంది. ఎలాంటి కల్మషమూ, స్వార్థమూ కనిపించలేదు.

అడ్డగోడకున్న ఇటుకలన్నీ పూర్తిగా తొలగించి, దేవి సత్యంగారి గుండెల మీద వాలిపోయింది.

"మిమ్మల్ని అపార్థం చేసుకున్నందుకు మొదట నన్ను క్షమించండి. ప్రేమించి పెళ్ళిచేసుకోవడం మీ ఆశయం కావచ్చు. అత్త కూతుర్ని పెళ్ళిచేసుకోవడం రాజేష్ ఆశయం కావచ్చు. ఎవరి ఆశయం వారిది. మీ ఆశయం గొప్పదే అయినా అది మీవరకే పరిమితం. దాన్ని మరొకరి మీద రుద్దడం న్యాయంకాదు. మీరు బాధపడకండి."

దేవి మాటలకు అతను చిన్నగా నవ్వాడు.

సత్యంగారి ఆశయం ఆ ఇంట్లో ఆ ఇద్దర్నీ ఏకాంతంగా వదిలి, రెక్కలు కట్టుకొని దూరంగా ఎగిరిపోయింది. ★

